అల్లుడి అభీష్టం

అజ్జరపు హనుమంతరావు

సాయంత్రం అయిదు గంటలైంది. పొలంనుంచి అప్పుడే వచ్చిన ఆనందరావుగారు కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కొని లుంగీ చుట్టబెట్టుకుని హాల్లో కొచ్చారు, ముఖం తుడుచుకుంటూ.

"ఏనండీ యివాళ కూడా ఏమీ ఉత్తరంలేదు వాళ్ళ దగ్గర్నుంచి .." అంది, వసుంధరమ్మగారు కాఫీ అందించి భర్త మొహంలోకి చూస్తూ.

ఆయనేం మాట్లాడలేదు. మేఘావృతమైన ఆకాశంలా ఉంది. ఆయన ముఖం. వాలు కుర్చీలో కూర్చున్నారు మౌనంగా. ఆయనేదో గాఢంగా ఆలోచిస్తున్నాడని గ్రహించి మౌనంగా వంటింట్లోకి నడిచిందావిడ ...

మరో అరగంటలోనే వంటింట్లో పని పూర్తి చేసుకుని మళ్ళీ భర్త దగ్గర కొచ్చింది వసుంధరమ్మగారు. ఆయనలో ఏ విధమైన మార్పులేదు! అలాగే స్థాణువులా కూర్చున్నాడు. ఏదో అడుగుదామని మళ్ళీ ఆ ప్రసక్తి మానుకుంది వసుంధరమ్మగారు. అడగవలసింది మాత్రం ఏముంది? తన కెంత తెలుసో ఆయనకీ అంతే తెలుసు! తనెంత బాధపడుతోందో అంతకు పదిరెట్లు మనసులో బాధపడుతున్నారాయన! తను మాత్రం పైకి వెళ్ళకక్కుతోంది - అంతే తేడా! ఆలోచిస్తూ అక్కడే కూలబడింది

"ఇదిగో! రేపొద్దున్న బండికి నేను గుంటూరు వెడుతున్నాను" నిశ్శబ్దాన్ని చీలుస్తూ హఠాత్తుగా అన్నారు ఆనందరావుగారు.

ఉలిక్కిపడింది వసుంధరమ్మగారు.

"అదేమిటి?! మీ రెందు కక్కడికి? .." అంది అయోమయంగా.

"ఎందుకేమిటి? అక్కడ పరిస్థితేమిటో! నెల్లాళ్ళబట్టి పదుత్తరాలు రాసినా జవాబు లేదుకదా! పండగ యిహ నాలుగురోజులుంది. ఎల్లుండే అందర్నీ వెంటబెట్టుకు చక్కా వస్తాను."

"బాగుంది వరస! అక్కడెవళ్ళెలా

ఉన్నారో అని మీరే అంటుంటిరి! పిల్లల కొంట్లో బాగాలేదో, అతనికే బాగాలేదో, అమ్మాయికి నలతగా వుందో ఇవేవీ తెలియకుండా, మీరు కూడా అక్కడికెళ్ళి కూర్చుంటే యీ కొంపలో నేనొక్కర్తినీ బిక్కుబిక్కు లాడుతూ కూర్చోలేను బాబూ! మీతో బాటు నేనూ వస్తాను పదండి ..." అంది కచ్చితంగా వసుంధరమ్మగారు.

ఆవిడ చెప్పిందీ సబబుగానే తోచిందాయనకి. ఈ సమయంలో భార్య నొక్కర్తినీ వదలి వెళ్ళడానికి ఆయనకి మనస్కరించలేదు....

"సరే, అయితే! పెందరాళే లేచి బట్టలు అవీ సర్దు ." అన్నాడు.

ఆవిడ మనస్సు కాస్త స్థిమిత పడింది!

2

రాత్రి పదిగంటలైంది

పేపరు మడిచి ప్రక్కనే పెట్టి నిద్ర కుపక్రమించారు ఆనందరావుగారు. మరో పదినిముషాల్లోనే గాఢనిద్రలో మునిగినట్టు ఆయన గుర్రే చెప్తోంది. వసుంధరమ్మగారికి మాత్రం నిద్రపట్ట లేదు. ఏవేవో ఆలోచనలు కందిరీగల్లా ఆవిడ మనస్సు చుట్టూ పరిభ్రమించ సాగాయి. కొద్దికొద్దిగా గతాన్ని స్మరించుకుందావిడ

ఉన్న ఒక్కగానొక్క కూతురికి ఘనంగానే పెళ్ళిచేసి కాపరానికిపంపి అప్పుడే పదేళ్ళవుతోంది. అల్లుడు కూడా ప్రస్తుతం చెప్పుకోతగ్గ స్థితిలోనే వున్నాడు. ఈ పదేళ్ళలోనూ అల్లుడు, కూతురు ముగ్గురు పిల్లలోటి పండుగలకని పబ్బాలకని పాతిక, ముప్పయి మాటేనా వచ్చుంటారు! వాళ్ళొచ్చిన పదిరోజులు ఇల్లు పెళ్ళివారిల్లులా కలకలలాడుతూ ఉంటుంది. వచ్చినప్పుడల్లా అల్లుడుగార్ని ఘనంగానే సత్కరిస్తూ వచ్చారిన్నాళ్ళూను! ఇక ముందూ అంతే! "అతనికి మాత్రం ఎవరున్నారు చెప్పు! తల్లి, తండ్రి అన్నీ మన మే గా! మనకీ అదొక్కర్తే నలుసు! దాని కడుపు పండి అందరూ చల్లగా ఉన్నారు అదే మనకి పదివేలు ..." అంటూంటారాయన. అల్లుడి కూడా తామంటే ఎంతో ఆపేక్ష! అటువంటి దీసారి ఇలా ఎందుకు జరిగింది? పండక్కి రమ్మని అప్పుడే పదుత్త రాలేనా రాసుంటారు: ఒక్కదానికి జవాబులేదు! కారణం తెలీక ఇరవై రోజులబట్టీ ఇద్దరూ సతమతమై పోతున్నారు. పోనీ ఏమైనా కోపం వచ్చిందా అంటే వాళ్ళకెప్పుడూ తెలుసున్నంత మటుకు ఎలాంటి లోపం జరగనివ్వ లేదు. అలాంటప్పుడు ఎందుకూ కోపం? కూతురు అల్లుడిమీద విసుగు పుట్టిందా క్షణంలో వసుంధరమ్మగార్కి. 'ఒకవేళ ఎవళ్ళ వొంట్లోనేనా గట్టిసుస్తీ చేసిందేమో! తెలియపరిస్తే బెంగ పెట్టుకుంటామని వూరుకున్నారేమో! పాపిష్టి దాన్ని అనవసరంగా విసుక్కున్నాను ...' అని తనలో తను అనుకుని, 'రేపెల్లాగా వెడుతున్నాంగా ..... అన్నీ తెలుస్తాయి ...' అని సమాధాన పడింది.... ఆలోచిస్తూనే ఎప్పుడో నిద్రలో కూరి



గింది, వసుంధరమ్మగారు.

3

గుంటూరు స్టేషన్లో బండి ఆగీ ఆగడంతో ప్లాటుఫారంమీద కూతురు, పిల్లల్ని చూసి ఆశ్చర్యపోయారు ఆనందరావు దంపతులు.

"మీ ఉత్తరం మధ్యాహ్నం ఆఫీసు కొచ్చినట్టుంది. వెంటనే స్టేషన్ కెళ్ళమని కబురు పంపారు మీ అల్లుడు! అఁ అన్నట్టు సామానేమీలేనట్టుంది. ఆ పెట్టె ఇలా ఇవ్వవే అమ్మా .." అంటూ తల్లి చేతిలోంచి చిన్న తోలు సూటుకేసు అందుకుంది విజయలక్ష్మి.

పిల్లలు ముగ్గురు తాత, అమ్మమ్మల చేతులు పట్టుకుని ముందుకు నడిపించారు. ఇద్దరికీ అంతా అయోమయంగా ఉంది. "అపునుగాని, ఏమేఁ విజ్జీ ఇదేం వగసే అమ్మా! ఉత్తరంముక్క రాసుకోరూ? హడిలి చచ్చాం! అల్లుదేవైనా అలిగాడా-ఏమిటి కథ? ..." అంటూ సాగదీసింది వసుంధరమ్మగారు. నడుస్తూనే కూతురేం చెప్తుందోనని చెవులు రిక్కించారు ఆనందరావుగారు. "యింటి కెళ్ళాక మాట్లాడుకుందాంలేవే అమ్మా.." అంది విజయ ముభావంగా. అంతా బయటికొచ్చి టాక్సీ ఎక్కారు

4

సాయంత్రం ఏడుగంటలైంది ....

"ఏమేఁ విజ్జీ అల్లుడెన్ని గంటల కొస్తాదేమిటి? .." అన్నా రానందరావుగారు వంటింట్లో కొచ్చి. పిల్లలి కన్నం పెడుతోంది విజయ. వసుంధరమ్మగారు ఆ పక్కనే కూర్చుని కూతురితో కబుర్లుచెబుతోంది. "ఏనిమి దవుతుంది నాన్నా! మీరు కూడా వచ్చేస్తా రేమిటి? ప్రొద్దున ఎప్పుడు

భోంచేశారో ఏమో॥ అమ్మా! నువ్వు కూడా రావే! మరేం ఫరవాలేదు. ఆయన నేనూ తర్వాత తింటాం ..." అంది విజయ.

"హవ్వ! అప్రతిష్ట! అతను రాకుండా మేం భోజనాలా? అయినా అసలు సంగతేవిఁటే అంటే కప్ప దాట్లు వేస్తావేం? ఉత్తరం రాయక పోవడానికి కారణం ఏవిఁటంట? మీ కొంపలు ఎందుకు మునిగాయి కొత్తగా? క్కాపలసిం దేవిఁటో చెప్తే మేం కాదంటామా? సాయంత్రం నుంచి అడుగుతుంటే మాట తప్పిస్తావుకాని అసలు విషయం చెప్పవు..." అంది వసుంధరమ్మగారు విసుగ్గా.

"అవునమ్మా! మీ మనసులో మాట ఉత్తరంలో నేనా రాయొచ్చుగా! అసలు సంగతేవిఁటి? " అన్నా రానందరావుగారు, ప్రక్కనే పీట వాల్చుకుని కూర్చుంటూ, తాపీగా.

"ఎప్పటికప్పుడు ఉత్తరం రాద్దా మనే నా ఉద్దేశం నాన్నాగారూ! కాని ఆయన పడనిస్తేగా! తీరా రాస్తే ఆయన కోరింది మీరు కాదంటారేమో వి ఆయన అనుమానం...."

విసుక్కోయా రానందరావుగారు.

"అదేవిఁటే!! మీ కేది ఎప్పుడు కావాలంటే నేను కాదన్నాను? నా ఆస్తి అనుభవించడానికి మీరు కాక ఇంకెవ రున్నారు? అయినా నేను కాదంటా నన్న అనుమానం అతని కెలా వొచ్చింది? ఇంతకాలం నుంచి మమ్మల్నింతే అర్థం చేసుకున్నా రన్నమాట " బాధగా అన్నా రాయన.

మళ్ళీ గొంతు సవరించుకుని ఆయనే అన్నారు .

"ఇంతకి అతని క్కావలసిం దేవిఁటట? "

"ఆ విషయం నన్ను మాత్రం చెప్పొద్దని వొట్టు కూడా పెట్టారు, మధ్యాహ్నం మీరు వొస్తున్నారని, స్టేషను కెళ్ళమని రాసిన ఉత్తరంలో " అంది, విజయ పిల్లలకి మజ్జిగపోస్తూ,

"బాగానే ఉంది " మూలిగింది వసుంధరమ్మగారు.

ఆనందరావుగారేం మాట్లాడలేదు. అల్లుడేదో పెద్ద ఎత్తుమీదే ఉన్నారని మనసులోనే అనుకున్నారు. కాని అల్లుడి ప్రవర్తనకి బాధపడ్డా రాయన. పిల్లలు భోజనాలు పూర్తిచేసి వాళ్ళ గదిలోకి పోయి చదువుకుంటూ కూర్చున్నారు.

5

ఎనిమిది గంటలైంది.

ప్రకాశరావు రావడంతో మామూలు పలకరింపులు, యోగక్షేమాలు పూర్త య్యాయి. సాధారణంగా వసుంధ రమ్మగారు అల్లుడితో ఎక్కువ మాట్లా డరు. ఈసారి ఆనందరావు కూడా మనసారా అల్లుణ్ని పలకరించలేక పోయారు. ప్రకాశరావు మాత్రం మామూలుగానే వున్నాడు. కూతురు, అల్లుడు ఒకర్నొకరు చూసుకోవడం చాటుగా నవ్వుకోవడం వసుంధరమ్మ గారు పసిగట్టింది. ఆవిడ ఒక

మందింది కూడాను!

భోజనాలైనాక మావాఁ అల్లుళ్ళిద్దరూ ఇష్టాగోష్టిగా కూర్చున్నారు. ఆ మాటా, యీ మాటా అయినాక ఆనంద ావుగా రన్నారు....

"ఏవోఁయ్! ఈసారి మా ఇంటికి రాదల్చుకోలేదా? ఉత్తరం పత్తరం రాయకపోవడంతో ఎవళ్ళ కెలా వుందోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొనొచ్చాం ..! విషయమేఁటో ఉత్తరంలోనేనా రాయొచ్చుగా ..."

"అవుననుకోండి! అయినా ఉత్తరం రాస్తే మీరు అశ్రద్ధ చేస్తారేమోనని.."

నసిగాడు ప్రకాశరావు.

"ఎంత మాటన్నావోయ్! నువ్వు నోరు తెరిచి అడగడం, నేను అశ్రద్ధ చెయ్యటమూనా? మీ ఆనందంకోసం కొండమీద కోతినయినా తీసుకు రావడానికి వెనుకాడను! నా సంగతి నీకు తెలియంది కనకనా "

"అది నిజమే ననుకోండి! ఇది నా ఒక్కడి కోరిక కాదు సుమండీ! మీ అమ్మాయి కూడా అంతో యింతో భాగం ఉంది. ."

"ఇంతకీ అసలు సంగతేవిఁటోయ్

మహానుభావా...."

"చెప్తాను వినండి .. మా పెళ్ళయి పదేళ్ళయింది! అవునా? ఇన్నేళ్ళూ మమ్మల్ని ప్రతిపండక్కీ ఆహ్వానించి యధావిధిగా సత్కరించి మీ రానం దిస్తున్నారు: మీ షష్టిపూర్తి అయిన మొదటి పండుగ యిది! ఒక విధంగా మీ రిప్పుడు క్రొత్త దంపతులన్న మాట! అలాంటప్పుడు మిమ్మల్ని పండక్కీ ఆహ్వానించి బట్టలవీ ఎవరు పెడతారు? అందుచేత మీ దంపతులిద్దర్నీ మా యింటికి రప్పించి సన్మానించి ఆనందించాలని మీ అమ్మాయి, నేను ఏకగ్రీవంగా తీర్మానించుకున్నాం! ఈ సంగతి మీకు రాస్తే మీరు రావడానికి ఒప్పుకోరు సరిగదా, తేలిగ్గా తీసి పారేస్తారు. అప్పుడు మా సరదా ఎలా తీరుతుంది చెప్పండి! మీ ఉత్తరాలకి జవాబు రాయకపోతే కంగారుపడి మీ రిద్దరూ వస్తారని మాకు తెలుసు....మిమ్మల్ని రప్పించడానికే యింత నాటకం ఆడాం తప్పయితే క్షమించండి మీ మనస్సులు మిమ్మల్ని స్టేషన్లోనే సాదరంగా ఆహ్వానించాయి....యిప్పుడు మీరు గాని మమ్మల్ని కాదని పండగ ఇక్కడ జరుపుకుని మా సత్కారాలందుకోకపోతే, ఇక మీ ఇంటికి మే మెప్పుడూ రానే రాం ." అన్నాడు ప్రకాశరావు చిరునవ్వు నవ్వుతూ

"అవును . అంతే ." అంది విజయలక్ష్మి తమలపాకులతో లోపలికి వస్తూ ..

ఆనందరావుగారి కళ్లు ఆనందంతో చెమర్చాయి "హాయి మీ . మొత్తానికి భలేవారే ." అంటూ గట్టిగా నవ్వి, గొంతు సవరించుకుని, "ఇదుగో.... ఏమేవ్! ఇది విన్నావా... వాళ్ల " అంటూ భార్యని పిలవబోయాడు.

గోడ పక్కనించి సంగతంతా విన్న వసుంధరమ్మగారు ముసిముసి నవ్వు నవ్వుతూ ప్రక్కకి తప్పుకోబోయేసరికి-

"అదేవిటే అమ్మా! అంత సిగ్గయితే ఎలాగే .. కొత్త పెళ్ళికూతురిలా!? మీ అల్లుడు గారేలే ..... ఇలా రా "

అంటూ పకపకా నవ్వింది విజయలక్ష్మి. ఆమెతో శృతి కలిపారు మామా అల్లుళ్ళు! ఏం చెయ్యాలో తెలియక వసుంధరమ్మగారు కూడా ఆఖరికి నవ్వేసి ఊరుకుంది

□□□